
JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి I గురువారం 18-06-2026
Medchal - Malkajgiri I Thursday 18-06-2026
Follow: jayabherinews
సంపుటి : 03 I సంచిక : 17
పేజీలు : 8 I వెల : 5
Vol. 03 I Issue 17 I Pages : 8 I ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


## జూన్ 19న వారి ఖాతాల్లోకి డబ్బులు



- కొత్తగా ఉద్యోగాల్లోకి చేరిన వారికి కేంద్రం శుభవార్త
- 2025 ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చిన పీఎం వీబీఆర్‌వై
- మొత్తం రూ. 99,446 కోట్ల బడ్జెట్ కేటాయించిన కేంద్రం
- ఉత్పాదక రంగానికి అధిక ప్రాధాన్యత

జయభేరి, న్యూఢిల్లీ:

ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన కింద జూన్ 19న రూ.2,400 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో కేంద్రం వేయనుంది. తొలిసారి ఉద్యోగంలో చేరి ఈపీఎఫ్ఓ ఉన్న వారికి నెల వేతనంగా రూ.15,000 వరకు, యజమాన్యానికి రూ.3,000 వరకు పీఎం వీ బీఆర్‌వై కింద అందజేస్తోంది. ఆగస్టు 1 2025 నుంచి జులై 31, 2027 మధ్య ఉద్యోగాల్లో చేరే వారికి ఇది వర్తిస్తుంది. ఉద్యోగికి ఏడాదికి 2 విడతల్లో.. యజమానికి రెండేళ్లలో ఈ మొత్తం అందనుంది. ఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఈ నిధులను ప్రధాని మోదీ విడుదల చేస్తారని అధికారులు తెలిపారు. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) విడుదల చేసిన ...మిగతాది 2 లో

## జూన్ 21న యోగాంధ్ర 2026



- సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు!
- అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "యోగాంధ్ర-2026" పేరిట విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.

జయభేరి, అమరావతి :

ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. "యోగాంధ్ర2026" పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఆయుష్ శాఖ ఉన్నతాధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. ...మిగతాది 2 లో

## గుడిసెలు లేని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

- రెండో విడత ఇందిరమ్మ ఇండ్లలో గుడిసెల వాసులకే తొలి ప్రాధాన్యత
- యుద్ధప్రాతిపదికన క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి అర్హుల ఎంపిక
- రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం కింద రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం
- ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ధి



జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్రంలో ఒక్క నిరుపేద కుటుంబం కూడా గుడిసెల్లో జీవించకుండా, ప్రతి కుటుంబం సురక్షితమైన సొంత ఇంటిలో గౌరవప్రదంగా జీవించేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిరు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను గుడిసెలు లేని ...మిగతాది 2 లో



రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న దాదాపు 27 లక్షల మంది విద్యార్థి యువతకు ఈ ప్రారంభోత్సవ శుభ సందర్భాన్ని అంకితం చేశారు. తెలంగాణలో మొట్టమొదటి ఈ ఆదర్శవంతమైన పాఠశాలను ప్రారంభించిన తర్వాత ఆవరణ ఆసాంతం తిరిగి పరిశీలించారు. ఇదే సందర్భంగా పాఠశాలల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థినీ విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు.

## ఆకలి తీర్చే కంచంలో బుక్కెడు బువ్వనవుతా..

- పేద బిడ్డల చదువులో చెరగని అక్షరాన్నవుతా..
- ఆశయాల కళ్లలో ఆనందపు వెలుగునవుతా..
- బంగారు భవితకు కచ్చితమైన భరోసా అవుతా..
- చదువుల తెలంగాణ నిర్మాణంలో నిత్య శ్రామికుడినవుతా..

జయభేరి, రంగారెడ్డి జిల్లా :

రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో అత్యంత ప్రతిష్టాత్మకంగా అత్యాధునిక వసతులతో నిర్మించిన పాఠశాల తరగతి గదులు, లైబ్రరీ, ఫిజిక్స్, బాటనీ, కెమిస్ట్రీ ల్యాబరేటరీల్లో ...మిగతాది 2 లో



## జూలై 19 నుంచి బోనాలు

జయభేరి, హైదరాబాద్, జూన్ 17 :

తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాల పండగ కు అంతా సిద్ధం అయింది. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన ఈ ఆషాఢ మాస బోనాల జాతరకు సంబంధించిన తేదీలను ఉత్సవ కమిటీ ప్రతినిధులు తాజాగా వెల్లడించారు. ఈ ఏడాది ఆషాఢ మాస బోనాలు.. జూలై 19వ తేదీన గోల్కొండ జగదాంబ అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో ఈ ఉత్సవాలు అధికారికంగా మొదలు కానున్నాయి. దాదాపు నెల రోజుల పాటు హైదరాబాద్ నగరం మొత్తం జరగనున్న ఈ బోనాల పండగ.. ఆగస్ట్ 10వ తేదీ వరకు అంగరంగ వైభవంగా కొనసాగుతాయని తెలిపారు. ఆషాఢ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని జూలై 19వ తేదీన చారిత్రక గోల్కొండ కోటలో జగదాంబ అమ్మవారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తొలి బోనం సమర్పించనున్నారు. ఇక అదే రోజున హైదరాబాద్ నగరంలోని పలు ప్రధాన ఆలయాల్లో ఘటాల ఊరేగింపు అంగరంగ వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో పలు కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. అప్పటి నుంచి ప్రతీ ఆదివారం, గురువారాల్లో అమ్మవారికి నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, బోనాలు సమర్పించనున్నారు. ...మిగతాది 2 లో

## మళ్లీ తెర పైకి డిలిమిటేషన్

2 లో



## పాలేరు పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్

- రాష్టంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై కేటీఆర్ సంచలన కామెంట్స్

జయభేరి, ఖమ్మం :

రాష్ట్రంలో రెవెన్యూ పడిపోతా ఉంది, కానీ రెవెన్యూ మంత్రి అవినీతి సామ్రాజ్యం వందల వేల రెట్లు పెరిగిపోయింది. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది కానీ రాష్ట్ర ఆర్థిక మంత్రి డిప్యూటీ సీఎం భట్టి ఆదాయం, కమిషన్ దందాలు మాత్రం జోరుగా సాగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బాంబుల మంత్రి పొంగులేటి ఎంత సంపాదించాడంటే నోట్లు లెక్క పెట్టే మెషీన్లు కూడా అలసిపోతున్నాయి. రెండు సంవత్సరాల కింద ఈడి దాడి చేసిన ఇప్పటిదాకా దానిపైన కనీస ప్రకటన రాలేదు. ఆనాడు ఈడి దాడి చేసి పట్టుకున్న వందల కోట్ల ...మిగతాది 2 లో

## తెలంగాణ ఇజ్జత్ తీయడమే సీఎం రేవంత్ పని



- సింగరేణిలో కార్మికుల కష్టాలు తెలుసుకునేందుకు వస్తే మమ్మల్ని అడ్డుకుంటున్నారు
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

జయభేరి, గోదావరిఖని :

"బాయిబాట"లో భాగంగా గోదావరిఖని 11 ఇంక్లైన్ కార్మికులతో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత గేట్ మీటింగ్ జరిపారు. కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కవిత మాట్లాడుతూ.. ఈ ముఖ్యమంత్రి తెలంగాణ ఇజ్జత్ తీయటమే పనిగా పెట్టుకున్నాడు. అప్పులు పుడుతలేవంటాడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫోన్ ఎత్తుత లేడని చెబుతాడు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇంత బేలగా మాట్లాడతడా? అందుకే మన రాష్ట్రంపై పెత్తనం కోసం పక్క రాష్ట్రం నాయకులు కుట్ర చేస్తున్నారు. సింగరేణిలో కార్మికుల కష్టాలు తెలుసుకునేందుకు వస్తే మమ్మల్ని అడ్డుకుంటున్నారు. కార్మికులకు కనీస అవసరాలు తీర్చకుండా ప్రభుత్వం, ఆఫీసర్లు ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. సింగరేణిని కాపాడేందుకు బీజేపీ ఎక్కువ బొగ్గు బ్లాకులు కేటాయించాలి. అండర్ గ్రౌండ్ మైనింగ్ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. కార్మికుల హక్కుల కోసం టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ పోరాటం చేస్తుంది. కార్మికులను కలిసేందుకు వస్తే ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఆకలి తీర్చే కంచంలో బుక్కెడు బువ్వనవుతా..

ఏర్పాటు చేసిన సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సైన్స్ ల్యాబొరేటరీలో వివిధ పరికరాలను చూశారు. విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యాల కోసం ఏర్పాటు చేసిన బస్సులను పరిశీలించారు. నృత్యం, సంగీతం బోధించే తరగతి గదులు, డిజిటల్ క్లాసులను సందర్శించారు. వంట గదిని పరిశీలించారు. వంటవారితో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పూరీ తయారీలో సహకరించారు. ఆవరణలో విద్యార్థులతో ముచ్చటించారు. అధ్యాపకుల కార్యాలయం సందర్శించారు. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో అత్యున్నత వసతులతో తీర్చిదిద్దిన వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ వంటి క్రీడాప్రాంగణాలు, టెన్నిస్, స్కారమ్స్ హాళ్లను, ఆవరణలోని పార్కులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కొద్దిసేపు సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. చాలా మంది విద్యార్థులతో కరచాలనం చేస్తూ ముఖ్యమంత్రి గారు వారిని ఆశీర్వదించారు. ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు సౌకర్యాలు కల్పించారు. అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలో ఇంగ్లీష్‌లో బోధిస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీలు వేంనరేందర్ రెడ్డి, రఘువీర్, సలహాదారులు కె. కేశవ రావు, శాసన మండలి చీఫ్‌విప్ Dr. P. మహేందర్ రెడ్డి , ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, విద్యా కమిషన్ చైర్మన్ మురళి IAS, ఇతర సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఇజ్జత్ తీయడమే సీఎం రేవంత్ పని

గేట్లు బంద్ పెట్టి అడ్డుకుంటున్నారు. ప్రతిపక్ష పార్టీలను సింగరేణి కార్మికులు కలవద్దా? కార్మికులకు ఏ పార్టీ వారితోనైనా మాట్లాడే హక్కు ఉంది. కానీ సింగరేణి యాజమాన్యం పోలీసులను తీసుకొచ్చి మమ్మల్ని అడ్డుకుంటున్నారని అన్నారు. అసలు సింగరేణి క్యాంప్ లోకి పోలీసులే రావద్దు. కానీ వాళ్లను తీసుకొచ్చారంటే వీళ్లు ఎంత తప్పు చేసి ఉంటారు? ఇదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భట్టి, రాహుల్ గాంధీ కూడా ఎన్నికలకు ముందు సింగరేణి కార్మికులతో మీటింగ్ లు పెట్టలేదా? మీ మాటలు నమ్మి కోల్ బెల్ట్ ప్రాంతంలో కాంగ్రెస్ ను గెలిపించారు. కానీ మీరు గెలిచాక గ్లౌజ్ లు, షూస్, మెషిన్లు ఏదీ నాణ్యత లేకుండా అయిపోయింది. గనుల్లో కి వెళ్లే కార్మికులకు కనీసం ఆక్సిజన్ కూడా ఇవ్వలేని పరిస్థితి తీసుకొచ్చారు. ఏమైనా అడిగితే గత ప్రభుత్వం మీద నెట్టేసి డబ్బులు లేవు అంటున్నారు. సింగరేణి కార్మికులకు మాట ఇచ్చే ముందు ఇవ్వన్నీ మీకు తెలియవా? కనీసం నీళ్లు, గాలి ఇచ్చే సోయి కూడా లేదు. ప్రాథమిక సౌకర్యాలు కూడా ఇవ్వటం లేదు. సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువ కావటంతోనే చిన్న చిన్న సౌకర్యాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. వీటన్నింటినీ ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. నాది ప్రశ్నించే తత్వం. నేను 20 ఏళ్లుగా సింగరేణి కార్మికులతో కలిసి పనిచేస్తున్నా. తెలంగాణ ఉద్యమంలో అగ్గిరాజేసి రాష్ట్రం సాధించుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కూడా కేసీఆర్ తో మాట్లాడి మీ కోసం పనిచేశా. ముఖ్యంగా డిపెండెంట్ ఉద్యోగాల కోసం నేను చేసిన పోరాటంతో 19 వేల ఉద్యోగాలు నడుచుకుంటూ వచ్చాయి. మహిళలకు సింగరేణిలో ఉద్యోగాలు వచ్చేలా చేశాం. నేను ఎప్పటికీ సింగరేణి బిడ్డనే. ఎక్కడున్న కార్మికుల కోసమే కొట్లాడుతా. సింగరేణి కార్మికులను ఆఫీసర్లు ఇబ్బంది పెడుతుండటం చాలా బాధాకరం. ఆఫీసర్లకే తమ హక్కులు కాపాడుకునేందుకు యూనియన్లు ఉన్నాయి. అలాంటిది కార్మికులకు తమ హక్కులు కాపాడుకోవటానికి యూనియన్లు ఉండొద్దా? కార్మికులను ఇబ్బంది పెట్టవద్దని...చిన్న వాటికే మెమో లు అంటూ పరేషాన్ చేయవద్దని రిక్వెస్ట్ చేస్తున్నా. వన్ విజన్ అన్నట్లుగా ఉండాలి. కానీ ఇక్కడ రెండు విజన్లు అన్నట్లుగా పనిచేస్తున్నారు. మీ కారణంగా మైన్ లో కార్మికులు సంతోషంగా లేరు. ఆఫీసర్లు మానవీయకోణంలో ఆలోచించాలి. డిజీల్ కుంభకోణంలో పైన ఉన్న పెద్దవాళ్లు చిన్న ఆఫీసర్లను ఇబ్బంది పెడితే రియాజ్ గారు నేనే వాళ్ల హక్కుల కోసం పోరాటం చేశాం. కార్మికుల హక్కులు, వారికిచ్చే సౌకర్యాలు, భద్రత కోసం ఆఫీసర్లే తమ పై అధికారులతో కొట్లాడాలి. ఈ కాంగ్రెస్ పార్టీ వాళ్లు మనల్ని రానివ్వొద్దని ప్రయత్నం చేస్తున్నారు. కానీ తల్లి కాంగ్రెస్ తోనే పోరాటం చేసి...తెలంగాణను సాధించుకున్నాం. ఇప్పుడున్న ఈ పిల్ల కాంగ్రెస్ ఎంత? ఈ ముఖ్యమంత్రి తెలంగాణ ఇజ్జత్ తీయటమే పనిగా పెట్టుకున్నాడు. ఢిల్లీకి అప్పు కోసం పోతే చెప్పులు ఎత్తుకుపోయే వాళ్లను చూసినట్లు చూస్తున్నారని అంటాడు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి తన ఫోన్ ఎత్తటం లేదని చెబుతాడు. మొన్నటికీ మొన్న నేను హిట్లర్ లాంటి వాడినంటూ గొప్పగా చెప్పుకుంటున్నాడు. అసలు ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇంత బేలగా మాట్లాడుతాడా? ఆయన బేలా మాటల కారణంగానే ఆంధ్రాలో ఉండే నాయకులు మనపై పెత్తనం చెలాయించేందుకు మళ్లీ కుట్రలు చేస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు చేస్తే 11రోజులు అన్నం తినలేదన్న పవన్ కళ్యాణ్ మళ్లీ తెలంగాణలో రాజకీయాలు చేస్తాడంట. వాళ్లను మనం అడ్డుకుంటున్నామంట. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి, ఈ పవన్ కళ్యాణ్ వారంలో మూడు రోజులు హైదరాబాద్ లోనే ఉంటున్నారు. మన ముఖ్యమంత్రి బేలగా మాట్లాడుతుంటే పక్క రాష్ట్రం వాళ్లు పెత్తనం కోసం వస్తున్నారు. అందుకే మన సంపద మనం కాపాడుకునేందుకు మనమంతా మేలుకోవాలి. కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్ సింగరేణికి కొత్త బ్లాక్ లు ఇవ్వాలి. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నకుహ పోవటంతోనే ఓపెన్ కాస్ట్ మైనింగ్ ను తెరవాలని అన్నారు. బొగ్గు బ్లాక్ లలో షాఫ్ట్ వేస్తే అవి ఇంకొక 50 ఏళ్ల వరకు నడుస్తాయి. ఓపెన్ కాస్ట్ మైనింగ్ అంటే కుదరదు. అండర్ గ్రౌండ్ మైనింగ్ చేయాల్సిందే. అండర్ గ్రౌండ్ మైనింగ్ కారణంగా పర్యావరణ పరిరక్షణతో పాటు వేలాది మందికి ఉపాధి దొరుకుతుంది. సింగరేణి కార్మికులకు కష్టాలపై మాట్లాడాల్సిన ఏఐటీయూసీ మౌనంగా ఉంది. సింగరేణి డబ్బులతో నిర్మించిన మెడికల్ కాలేజ్ లో 25 శాతం సీట్లు కార్మికుల పిల్లలకు ఇవ్వాలి. కానీ ఐదు శాతం కూడా ఇవ్వటం లేదు. దీనిపై ఏఐటీయూసీ నేతలు మాట్లాడటం లేదు. సింగరేణి కార్మికుల పిల్లలు చదువుకునేందుకు మంచి స్కూల్స్ ఏర్పాటు చేయాలి. సింగరేణిని కాపాడటమే మా ప్రథమ కర్తవ్యం. మా ట్రేడ్ యూనియన్ హెచ్ఎంఎస్. రకరకాల కారణాలతో నేను కొత్తగా పార్టీ పెట్టాల్సి వచ్చింది. మా పార్టీకి మీ ఆశీర్వాదం కావాలని బాయిబాట కార్యక్రమం ద్వారా ఇక్కడకు వచ్చాను. నేను కష్టాల్లో ఉన్నప్పుడు మీ మద్దతు కావాలని వచ్చాను. మీరు కష్టంలో ఉన్నప్పుడు నేను మీకోసం పోరాటం చేస్తాను. మిమ్మల్ని ఆఫీసర్లు ఇబ్బంది పెడితే ఒక్క ఫోన్ చేయండి. మేము వచ్చి మీకోసం పోరాటం చేస్తామని అన్నారు.


## జూలై 19 నుంచి బోనాలు

ఈ బోనాల ఉత్సవాల్లో అతి కీలక ఘట్టాలు ఆగస్ట్ తొలి వారంలో జరగనున్నాయి. ఆగస్ట్ 2వ తేదీ ఆదివారం రోజున లష్కర్ (సికింద్రాబాద్) ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలతో పాటు ప్రధాన ఆలయాల్లో అమ్మవారికి భక్తులు భారీ ఎత్తున బోనాలను సమర్పించనున్నారు. ఆగస్ట్ 3వ తేదీ సోమవారం రోజున సికింద్రాబాద్ మహంకాళి ఆలయంలో పవిత్ర రంగం (భవిష్యవాణి) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ తర్వాత అంబారిపై అమ్మవారిని సాగనంపే ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. గోల్కొండ జగదాంబ అమ్మవారికి తొలి బోనంతో ప్రారంభం కానున్న ఈ బోనాల జాతర.. ఆ తర్వాత లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారు.. పాతబస్తీలోని ఉమ్మడి దేవాలయాల ఉత్సవాలతో ముగియనుంది. ఆగస్ట్ 10వ తేదీన ఉమ్మడి దేవాలయాల ఉత్సవాలతో పాటు సామూహిక ఊరేగింపు.. గజరాజుపై అమ్మవారి శోభాయాత్రతో ఈ సంవత్సరం ఆషాఢ బోనాల జాతర ముగియనుంది. ఇక రాష్ట్ర పండగ అయిన ఈ బోనాల పండుగను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు తెలంగాణ సర్కార్ ఇప్పటికే ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. నగరంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ, జలమండలి, పోలీస్, విద్యుత్ సహా అన్ని శాఖల సమన్వయంతో భారీ ఏర్పాట్లు, భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

# మళ్లీ తెరపైకి డీలిమిటేషన్

జనాభా ఆధారిత డీలిమిటేషన్ ఫార్ములాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనాభా నియంత్రణను పక్కాగా అమలు చేసి, దేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నందుకు తమకు సీట్లను తగ్గించి శిక్షిస్తారా? అని చంద్రబాబు నాయుడు, స్టాలిన్ వంటి నేతలు ఇప్పటికే బహిరంగంగానే ప్రశ్నించారు. ఒకవేళ కేంద్రం 50 శాతం పెంపు ఫార్ములాను మొండిగా ముందుకు తీసుకెళ్తే దక్షిణాది పార్టీలు ఖచ్చితంగా వ్యతిరేకిస్తాయి. అయితే, ఒకవేళ ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రతిపాదించిన 'టార్గెటెడ్ అండ్ వెయిటెడ్' పద్ధతిని ప్రవేశపెట్టి.. జనాభా నియంత్రించిన రాష్ట్రాలకు ప్రత్యేక వెయిటేజీ ఇస్తే మాత్రం దక్షిణాది పార్టీలు ఆ ఫార్ములాకు ఓటేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టంగా మారినప్పటికీ, అది అమలు కావాలంటే డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి కావడం సాంకేతికంగా అత్యంత కీలకం. ఉత్తరాదిలోని ఎస్పీ, ఆర్జేడీ వంటి పార్టీలు కోటాలో కోటా ఓబీసీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ డిమాండ్ చేస్తున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, ఒక దేశం, ఒక ఎన్నిక బిల్లు రెండింటికీ పార్లమెంటరీ ఆమోదం పొందాలని ప్రభుత్వం ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తున్నది.

డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపచేయడానికి ప్రభుత్వం గతంలో చేసిన ప్రయత్నానికి పార్లమెంట్‌లో అవసరమైన మద్దతు లభించకపోవడంతో ఈ అంశం మళ్లీ వెలుగులోకి వచ్చింది.అయితే, పార్లమెంట్‌లో ఎన్డీఏ బలం పెరుగుతున్న తరుణంలో, మహిళా ఓటర్ల మద్దతును పూర్తిగా స్వంతం చేసుకోవడానికి కేంద్రం ఈ రెండు బిల్లులను ఒకేసారి ముడిపెట్టి ఆమోదించే వ్యూహంతో ముందుకు వెళ్తోందిరాబోయే రోజుల్లో డీలిమిటేషన్ చర్చ కేవలం సీట్ల సంఖ్యకు పరిమితం కాకుండా.. భారతదేశ సమాఖ్య స్ఫూర్తికి ఒక పెద్ద పరీక్షగా మారబోతోంది. మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో లభించిన 2/3 వంతు మెజార్టీతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుందా, లేదా దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక సలహా మండలి సూచించిన సమతుల్య ఫార్ములా వైపు మొగ్గు చూపుతుందా అనేది తేలాల్సి ఉంద దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన , మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుపై రాజకీయ సమీకరణాలు అత్యంత వేగంగా మారుతున్నాయి.




గతంలో ఎన్డీఏ కూటమికి పార్లమెంట్‌లో మూడింట రెండు వంతుల మెజార్టీ లేకపోవడం వల్ల ఈ రాజ్యాంగ సవరణల ప్రక్రియ సాధ్యం కాదనే చర్చ నడిచింది. అయితే, లోక్‌సభలో అనూహ్యంగా తృణమూల్ కాంగ్రెస్ కి చెందిన సుమారు 20 మంది ఎంపీలు ప్రభుత్వానికి మద్దతుగా నిలవడం, ఇండీ కూటమిలోని సమాజ్‌వాదీ పార్టీ వంటి కొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా మహిళా రిజర్వేషన్ల క్రెడిట్ కోసం సానుకూల సంకేతాలు ఇస్తుండటంతో మోదీషా ద్వయానికి అవసరమైన సంఖ్యాబలం సమకూరుతున్నట్లు స్పష్టమవుతోంది.

అసలు డీలిమిటేషన్ ఏ ప్రాతిపదికన జరగబోతోంది? దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్తు ఏంటి? ఈ ఫార్ములా ప్రకారం.. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సీట్ల సంఖ్యను నేరుగా దాదాపు 50 శాతం పెంచుతారు. కొత్త పార్లమెంట్ భవనాన్ని కూడా ఇదే సంఖ్యాబలానికి అనుగుణంగా నిర్మించారు.

కేవలం జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే, జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సీట్లు పెరుగుతాయి. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాజకీయ సమీకరణాలు గణనీయంగా మారిపోయాయి. తమిళనాడు ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌డీఎంకే కూటమి విచ్ఛిన్నమైందన్న వార్తలు చర్చనీయాంశంగా ఉన్న కీలక పరిణామాల్లో ఒకటి. బిల్లుకు విస్తృత మద్దతు కూడగట్టే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం డీఎంకేను సంప్రదించే ప్రయత్నాలను ప్రారంభించినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. అదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్‌లోని పరిణామాలను కూడా నిశితంగా గమనిస్తున్నారు. ఒకవేళ గణనీయ సంఖ్యలో ఎంపీలు టీఎంసీ నుంచి విడిపోతే అది పార్లమెంటరీ సమీకరణాలను మార్చివేసి బిల్లు ఆమోదానికి అవసరమైన మద్దతును కూడగట్టడంలో ప్రభుత్వానికి సులభతరం చేస్తుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.పోయినసారి డీలిమిటేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినపుడు దాని ఆమోదం పొందేందుకు ప్రభుత్వానికి మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరమైంది.

అంటే బిల్లుకు అనుకూలంగా కనీసం 362 ఓట్లు అవసరం. అయితే బిల్లుకు 298 మంది సభ్యుల మద్దతు మాత్రమే లభించింది. బిల్లుకు వ్యతిరేకంగా 230 మంది ఎంపీలు ఓటు వేశారు. ఫలితంగా బిల్లుకు అవసరమైన సంఖ్యాబలం దక్కక సభలో వీగిపోయింది.

జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్లు పెంచితే దేశ సమగ్రతకు, సమాఖ్య స్ఫూర్తికి నష్టం వాటిల్లుతుందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఒక ప్రత్యామ్నాయాన్ని సూచించింది. కేవలం జనాభాయే కాకుండా.. భౌగోళిక విస్తీర్ణం, ఆర్థిక వృద్ధి, అక్షరాస్యత వంటి వివిధ సూచీలను పరిగణనలోకి తీసుకుని 'టార్గెటెడ్ నియోజకవర్గాల విభజన' చేయాలని ప్రతిపాదించింది. దీనివల్ల ఉత్తరాదికి సీట్లు పెరిగినప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలు మరీ ఘోరంగా నష్టపోకుండా ఒక సమతుల్యత సాధ్యమవుతుంది.

---

## జూన్ 21న యోగాంధ్ర2026

యోగం కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా ఆరోగ్యవంతమైన జీవన విధానానికి మార్గమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల్లో యోగా పట్ల మరింత అవగాహన పెంచేందుకు యోగాంధ్ర కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని అధికారులకు సూచించారు. యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో ప్రతి వర్గం ప్రజల భాగస్వామ్యం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయానికి ప్రాధాన్యం యోగా దినోత్సవ విజయవంతమైన నిర్వహణ కోసం అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్, పోలీస్, సమాచార శాఖలు తమ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమాల నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో, మండలంలో, గ్రామ స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యోగాంధ్ర2026 ద్వారా ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు యోగా ఎంతో ఉపయోగకరమని వివరించారు.

అందుకే రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే లక్షలాది మంది విద్యార్థులు, వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు యోగాంధ్ర కార్యక్రమాల్లో నమోదు చేసుకున్నారని అధికారులు సీఎంకు వివరించారు. యోగా దినోత్సవం నాడు రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో పాల్గొనేవారి సంఖ్యను మరింత పెంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, ప్రతి కుటుంబంలో యోగా ఒక నిత్యకృత్యంగా మారాలని ఆకాంక్షించారు.ఈ నేపథ్యంలో యోగాంధ్ర2026 కార్యక్రమాన్ని ప్రజల ఉద్యమంగా మార్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోంది. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం రాష్ట్రవ్యాప్తంగా భారీ ప్రజా భాగస్వామ్యంతో విజయవంతం కానుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

## జూన్ 19న వారి ఖాతాల్లోకి..

అధికారిక ప్రకటన ప్రకారం.. ఉద్యోగ కల్పనను వేగవంతం చేయడం, ఉపాధిని ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడం, అన్ని రంగాలలో సామాజిక భద్రతా పరిధిని విస్తరించడం లక్ష్యంగా పెట్టుకున్న భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం అయిన పీఎంవీబీఆర్‌వై అమలులో ఈ నిధుల విడుదల ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ పథకం ఇప్పటికే దేశవ్యాప్తంగా 15 లక్షల ఉద్యోగ అవకాశాల కల్పనకు తోడ్పడింది. పీఎంఓ ప్రకటన ప్రకారం.. కార్మికులు, యజమానులు ఇద్దరినీ అధికారిక ఆర్థిక వ్యవస్థలో పాల్గొనేలా ప్రోత్సహించడానికి పీఎంవీబీఆర్‌వై రూపొందించారు. ఈ పథకం కింద తొలిసారిగా ఉద్యోగంలో చేరే వారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం లభిస్తుంది. ఇది వారు ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే క్రమంలో కీలకమైన మద్దతును అందిస్తుంది. ఉపాధిని కల్పించే యజమాన్యానికి నెలకు రూ. 3,000 వరకు ప్రోత్సాహకంగా ఇస్తారు. ఇది నిరంతర ఉద్యోగ కల్పనను ఇది ప్రోత్సహిస్తుంది. ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపించడంలో ఉత్పాదక రంగానికి ఉన్న వ్యూహాత్మక ప్రాధాన్యతను గుర్తిస్తూ... ఈ రంగంలోని యజమానులకు నాలుగేళ్ల పాటు, మిగిలిన అన్ని ఇతర రంగాలలోని యజమానులు రెండేళ్ల పాటు ఈ ప్రోత్సాహకాలు పొందేందుకు అర్హులని ఆ ప్రకటన పేర్కొంది. ఉపాధి ఆధారిత వృద్ధికి అనువైన వాతావరణాన్ని పెంపొందించడం, దేశ ఆర్థిక ప్రగతి ఫలాలు యువతకు నాణ్యమైన అధికారిక ఉద్యోగావకాశాలుగా మారేలా చూడటంలో ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను ఈ పథకం ప్రతిబింబిస్తుంది. 'పీఎంవీబీఆర్‌వై'పథకం 2025 ఆగస్టు 1 నుంచి అమలులోకి వచ్చింది. మొత్తం రూ. 99,446 కోట్లు బడ్జెట్‌తో రెండేళ్ల కాలవ్యవధిలో 3.5 కోట్లకు పైగా ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించడం ఈ పథకం ముఖ్య లక్ష్యం. ఈ మొత్తం లబ్ధిదారులలో సుమారు 1.92 కోట్ల మంది మొదటిసారి ఉపాధి రంగంలోకి అడుగుపెడుతున్న యువత ఉంటారని అంచనా. ఉద్యోగులు, యజమానులు ఇద్దరికీ అండగా నిలవడం వల్ల ఉపాధిని విస్తరించడంలో, సామాజిక భద్రతా పరిధిని బలోపేతం చేయడంలో, వికసిత్ భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఈ పథకం ఒక ముఖ్య పాత్రను పోషిస్తోందని పీఎంఓ ప్రకటన పేర్కొంది.

## పాలేరు పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్

రూపాయల పైన కనీసం ప్రకటన లేదు. పొంగులేటి ఈడి దాడి పైన బిజెపి కానీ కాంగ్రెస్ కానీ ఎందుకు మాట్లాడలేదు ఇన్ని రోజులు. బిజెపితో పొంగులేటికి ఉన్న లాలూచీ కారణంగానే ఈడీ ఆయన పైన కేసు పెట్టలేదు. తెలంగాణలో కోటి ఎకరాలు తెలంగాణ రాష్ట్రంలో వివాదస్పద జాబితాలో పెట్టి వాటిని దోచుకుంటున్నాడు. కోటి ఎకరాల పైన ఆంక్షలు పెట్టి ఆ భూములను బెదిరించి సెటిల్మెంట్లు చేయించుకుంటూ నికృష్టమైన పనులు చేస్తున్నాడు. రేవంత్ రెడ్డి దొంగ అయితే పొంగులేటి గజ దొంగ మాదిరిగా దోచుకుంటున్నాడని ఆరోపించారు. పొంగులేటి డైలాగులు, అహంకారం ప్రజలందరూ చూశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బిసి మంత్రులు కొండా సురేఖ ని మాట్లాడనియ్యకుండా మైక్ కట్ చేశారు. పక్కన ఉన్న మరో బీసీ మంత్రి వాకిటి శ్రీహరి మీద కాగితాలు విసిరేశారు. ఎంత అహంకారం కాకుంటే తోటి మంత్రులతో అంత అహంకారంగా ప్రవర్తిస్తాడు. బిసి మంత్రులు కూడా పొంగులేటి మాదిరే ప్రజలతో ఎనుకోబడ్డ వారు అని గుర్తుంచుకోవాలి. అధికారులను పట్టుకొని సెన్సు ఉందా అని అహంకారంతో పొంగులేటి మాట్లాడుతున్నాడు. ఈరోజు నేను అడుగుతున్నాను నీకు సెన్సు ఉందా పొంగులేటి. ఇష్టానుసారంగా దోచుకోవడానికి, అక్రమ మైనింగ్ చేయడానికి నీ కుమారుడిని అడ్డుపెట్టుకొని వట్టి నాగులపల్లిలో గజదొంగల భూములు దోచుకోవడానికి నీకు సెన్సు ఉందా అని అడుగుతున్నారు. వట్టి నాగులపల్లిలో పదుల ఎకరాల పైన మీ కొడుకు మరియు కిరాయి మూకలు పంపి వాళ్లపై దాడి చేసింది వాస్తవం కాదా? నీ కొడుకు పైన పోలీస్ కేసు నమోదు చేస్తే ట్రాన్స్ఫర్ చేసింది వాస్తవం కాదా? నీ అన్యాయాలు, అక్రమాలు అహంకారం ప్రజలు చూడట్లేదు అనుకుంటున్నావా? అందుకే పాలేరులో ఎప్పుడు ఎన్నిక వచ్చినా గులాబీ జెండా మాత్రమే ఎగురుతుంది. హౌసింగ్ మంత్రిగా 20 లక్షల ఇండ్లు కడితేనే ఓట్లు అడుగుతా అన్నావు కదా ఆ మాట మీద నిలబడే సత్తా ఉన్నదా అని నిలదీసారు.

## గుడిసెలు లేని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. బుధవారం హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత అమలు, గుడిసెల గుర్తింపు, రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం, అసంపూర్తి గృహాల వివరాల సేకరణ తదితర అంశాలపై మంత్రి గారు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసిన తర్వాతే ఇతర దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

**గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే:**
రాష్ట్రంలోని ప్రతి గ్రామం, వార్డు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గుడిసెలను యుద్ధప్రాతిపదికన గుర్తించేందుకు సమగ్ర సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వద్ద ఇప్పటికే ఉన్న సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధృవీకరించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నామని దరఖాస్తు చేసుకున్నారని, ఆ దరఖాస్తులన్నింటినీ ప్రత్యక్షంగా పరిశీలించి నిజమైన అర్హులను గుర్తించాలని ఆదేశించారు. ఎంపీడీవో స్థాయిలో జాబితాలను సిద్ధం చేసి సంబంధిత ఇన్‌చార్జి మంత్రుల ఆమోదానికి పంపించాలని సూచించారు. గుడిసెల్లో నివసిస్తూ గతంలో ప్రజాపాలన లేదా ఇతర కార్యక్రమాల్లో దరఖాస్తు చేసుకోని నిరుపేద కుటుంబాలు ఇప్పుడు కూడా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి గారు తెలిపారు. అటువంటి దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు.

**రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు:**
రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు వేగవంతం చేయాలని మంత్రి గారు సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున మంజూరు చేసిన నేపథ్యంలో అర్హుల ఎంపికను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

**రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి ప్రత్యేక ప్రాధాన్యత:**
పేదల నివాస భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి గారు తెలిపారు. రెండో విడతలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఇళ్లను ఈ పథకం కింద ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. గోడలు, పునాదులు బలంగా ఉన్నప్పటికీ పైకప్పులు టార్పాలిన్ షీట్లు, రేకులు, నాపరాళ్లు లేదా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పైకప్పుల కింద నివసిస్తూ ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను గుర్తించి వారికి ఆర్‌సీసీ స్లాబ్ నిర్మాణం కోసం రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు.

# బిడ్డల భవితను తీర్చిదిద్దే అక్షర ఆలయం

- "తెలంగాణ పబ్లిక్ స్కూల్"
- విద్య విషయంలో నా కల నిజమైన సందర్భంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కాసేపు

**జయభేరి, హైదరాబాద్ :**




ప్రభుత్వ పాఠశాలలంటే అనాథలు, ఆర్థికంగా చితికిపోయిన వారు చదువుకుంటారన్న అభిప్రాయాన్ని సంపూర్ణంగా మార్చి, మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలన్న సంకల్పంతో ఆరుట్ల గ్రామంలో ప్రారంభించిన తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి లోకానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిలషించారు. కార్పొరేట్ స్థాయికి ఏమాత్రం తీసిపోని రీతిలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, అత్యాధునిక వసతులతో రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తీర్చిదిద్దిన తెలంగాణ మోడల్ స్కూల్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఇదే సందర్భంగా విద్యార్థులకు ఉదయం అందించే బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులకు ఆరుట్ల పబ్లిక్ స్కూల్ స్ఫూర్తిగా నిలుస్తుందంటూ, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేనేజ్‌మెంట్ కమిటీకి అభినందనలు తెలిపారు. "ప్రభుత్వ పాఠశాల అనగానే తక్కువగా భావించే విధంగా అందరి మదిలో నెలకొన్న అనుమానం, అపనమ్మకాలను పోగొట్టాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విధంగా కుటుంబాల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి. ప్రభుత్వ బడుల్లో చదువుకుంటే డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ లుగా రాణించగలరన్న ఒక బృహత్తర సంకల్పంతో ఈ పాఠశాలను తీర్చిదిద్దాం. ఆరుట్ల పాఠశాల తెలంగాణకు ఒక రోల్ మోడల్ గా, స్ఫూర్తిదాయకంగా నిలవాలి" అని అన్నారు. "విధ్వంసమైన తెలంగాణ విద్యా విధానాన్ని వికాసం వైపు నడిపించే విధంగా ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఆదర్శంగా నిలుస్తుందని విశ్వసిస్తున్నా. ఈ స్కూల్ రోల్ మోడల్ గా ఎలా నిలుస్తుందో ఎవరొచ్చినా చూపించాలి. ఈ అద్భుతమైన కార్యానికి ప్రజలు సంపూర్ణంగా అండదండలు అందించాలి" అని ముఖ్యమంత్రి కోరారు.

"అభివృద్ధి అంటే అద్దాల మేడల్లో రంగుల గోడల్లో కాదు. తెలంగాణ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది. విద్యపై పెట్టే ఖర్చు భవిష్యత్తు పెట్టుబడి అని సంపూర్ణంగా విశ్వసిస్తా. విద్యతోనే సమాజంలో మార్పు తీసుకురావాలి, అంటరానితనాన్ని, అసమానతలను నిర్మూలించాలి" అని పేర్కొన్నారు. మూడు లక్షల కోట్లపైన ఉన్న రాష్ట్ర బడ్జెట్ లో 8 శాతానికి పైగా దాదాపు 26 వేల కోట్ల రూపాయలు విద్యా శాఖపైన, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఖర్చు చేస్తున్నామని చెప్పారు. "ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు పాఠశాలలో 1814 మంది పిల్లలు పాఠశాలలో చేరగా, సీట్లు ఖాళీ లేవని, అడ్మిషన్లు పూర్తయ్యాయని ప్రభుత్వ పాఠశాల బయట బోర్డు పెట్టే పరిస్థితికి రావడం పట్ల కమిటీని అభినందిస్తున్నా. ఉపాధ్యాయులు తెలంగాణ సమాజానికి గొప్ప ఆదర్శంగా నిలబడ్డారు" అని ముఖ్యమంత్రి వారిని అభినందించారు. ఆరుట్ల పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో వచ్చిన అనుభవాలను పాఠాలుగా పరిగణలోకి తీసుకుని భవిష్యత్తులో ఇతర స్కూళ్లను మరింత మెరుగ్గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. ఈ స్కూళ్లలో చదివి రేపటి భవిష్యత్తు నాయకులుగా తయారవుతారని సంపూర్ణంగా విశ్వసిస్తున్నాం" ఆశాభావం వ్యక్తం చేశారు. "తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి పాత్ర మరువలేనిది. అందుకే ఇక్కడ పాఠశాలను తీర్చిదిద్దాం. ఆరుట్ల గ్రామ ప్రజలు, తల్లిదండ్రులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలో తీసుకుని ప్రతి పేదవారికి విద్యను అందించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టాం" అని వివరించారు. "ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటే చిన్నతనం కాదు. ముఖ్యమంత్రిగా నేనే కాదు. దేశంలో గొప్ప గొప్ప వాళ్లంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారే. కేవలం సంక్షేమ పథకాలు భవిష్యత్తును మార్చలేవు. మన భవిష్యత్తు మారాలన్నా, తల్లిదండ్రులు ఆత్మగౌరవంతో బతకాలంటే చదువుకోవాలి. చదువుకున్నప్పుడే మన ఊరికి, మన రాష్ట్రానికి, దేశానికి పేరొస్తుంది" అని హితవు చెప్పారు. "ఎవరెన్ని విమర్శలు చేసినా, విద్యా సంస్కరణలతో ముందుకు వెళుతూ కేజీ నుంచి పీజీ వరకు అత్యుత్తమ విద్యను అందించాలన్నది మా సంకల్పం. విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తున్నాం. వివిధ కులాల వారిగా వేర్వేరుగా పాఠశాలలు ప్రారంభించి కులాలు, వర్గాల అడ్డుగోడలు నిర్మించి విభజన చేస్తున్న విధానికి స్వస్తి పలకాలన్న లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్కూల్ కిట్ల గురించి చెబుతూ "ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ డ్రెస్సులు, షూలు, సాక్సులు, దుప్పట్లు, స్కూల్ బ్యాగులతో కూడిన కిట్స్ అంతర్జాతీయ ప్రమాణాలతో, అంతర్జాతీయ సంస్థలతో తయారు చేయిస్తున్నాం. రూ. 688 కోట్లతో టెండర్లు పిలిచాం. పనులు జరుగుతున్నాయి. జూలై ఆఖరు నుంచి వాటిని పంపిణీ చేస్తామని చెప్పారు". "మాదక ద్రవ్యాల వాడకం ఒక మహమ్మారిగా మారింది. ఈ దురలవాట్లను నియంత్రించాల్సిన అవసరం ఉంది. ఈ నెల 19వ తేదీన ఎల్బీ స్టేడియం వేదికగా రాష్ట్ర గవర్నర్ సమక్షంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులతో ప్రమాణం చేయించే కార్యక్రమం ద్వారా మాదక ద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులను చైతన్యం చేసే కార్యక్రమం చేపడుతున్నాం" గంజాయి లేదా ఇతరత్రా మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్న సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులను కోరారు.

"ఏఐతో ప్రపంచ వ్యాప్తంగా వైట్ కాలర్ ఉద్యోగాలు ప్రమాదంలో పడుతున్న నేపథ్యంలో నైపుణ్యాలను నేర్పించి బ్లూ కాలర్ ఉద్యోగాలు కల్పించాలన్న ఉద్దేశంతో స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించాం. మొదటి ఏడాదిలోనే అందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కి మంచి అవకాశాలు పొందడం సంతోషించదగిన విషయం" అని వ్యాఖ్యానించారు. "140 కోట్ల జనాభా కలిగిన దేశం నుంచి ఒలింపిక్స్ క్రీడల్లో రాణించలేకపోతున్నాం. ఒక్క స్వర్ణ పతకాన్ని కూడా సాధించలేకపోతున్నామంటే తలదించుకోవలసిన పరిస్థితి. అందుకే పబ్లిక్ - ప్రైవేట్ మోడల్ లో స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించుకున్నాం. విద్యార్థులు, క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపడానికే ఫుట్ బాల్ ప్రపంచ దిగ్గజం LionelMessi ని హైదరాబాద్ రప్పించాం" అని గుర్తుచేశారు. ఈ పాఠశాలను ఆదర్శంగా తీసుకుని తెలంగాణ నలుమూలల స్ఫూర్తిగా నిలవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ప్రయత్నిస్తుంది అని పేర్కొన్నారు.



# సర్కార్ బడిలో చేరిన వార్డు సభ్యురాలి మనుమడు

- అభినందించిన గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి గ్రామ పంచాయితికి చెందిన సీనియర్ వార్డు సభ్యురాలు పాతమాలే మంగమ్మ మనుమడు బుధవారం ప్రభుత్వ పాఠశాలలో చేరారు. లక్ష్మీ పల్లి గ్రామ పంచాయితీ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు వరుసగా ఆరు సార్లు వార్డు మెంబర్ గా ఎన్నికైన పాతమాలే మంగమ్మ మనుమడు తన మనుమడు పాతమాలే శివ కుమార్ (పాతమాలే శేఖర్ లావణ్య ల దంపతుల కుమారుడు) ను స్థానిక లక్ష్మీ పల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి లో చేర్పించి అందరికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా సీనియర్ వార్డు మెంబర్ పాతమాలే మంగమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని కోరారు. మెరుగైన సదుపాయాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. సర్కార్ పాఠశాలల్లో సుశిక్షుతులైన ఉపాధ్యాయులుంటారన్నారన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు.ప్రభుత్వ బడిలో తన మనుమడిని చేర్పించిన వార్డు మెంబర్ మంగమ్మను పాఠశాల హెచ్ యం ఎస్.కల్పన, ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్రశేఖర్, విజయ లక్ష్మీ, నాగేశ్వర్ రెడ్డి లతో పాటు గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభిందించారు.

# తిరుపతిలో ఎమ్మెల్యే జిఎంఆర్ పూజలు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) బుధవారం తిరుపతి వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే జిఎంఆర్ వెంట డాక్టర్ పీజీ బాబు తదితరులు ఉన్నారు.

# శుభకార్యానికి హాజరైన హైకోర్టు న్యాయవాది



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కౌకుంట్ల మండల కేంద్రంలో బుధవారం బిఎస్ఆర్ కన్వెన్షన్ లో జరిగిన గుమ్మడాల కిషోర్ గౌడ్ వివాహానికి హైకోర్టు న్యాయవాది, దేవరకద్ర నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు.

# దేవరకద్రలో పరిస్థితిని సమీక్షించిన ఎమ్మెల్యే జిఎంఆర్

- విద్యుత్ వెంటనే పునరుద్ధరించాలని ఆదేశం



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో గాలివాన బీభత్సం సృష్టించి దేవరకద్ర పట్టడం అతలాకుతలం అయిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) బుధవారం రాత్రి పూటాహుటిన దేవరకద్రకు వచ్చారు. వివిధ మండలాల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే జిఎంఆర్ ఈ విషయం తెలిసిన వెంటనే ఆయా శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. అంతేకాకుండా పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని దేవరకద్ర కు వచ్చి వర్షం కారణంగా భీభత్సవం సృష్టించిన ప్రాంతాలను పరిశీలించారు. గాలివాన కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో వెంటనే దేవరకద్ర పట్టణంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సంబందించిన అధికారులను ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశించారు. పట్టణ ప్రజలతో మాట్లాడి అన్ని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే జిఎంఆర్ మొహరం శుభాకాంక్షలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ముస్లిం సోదరులకు నియోజకవర్గ ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ మొహరం శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లామిక్ నూతన సంవత్సరం సందర్భంగా జరుపుకునే ఈ మొహరం పండుగ సంస్కృతి సంప్రదాయానికి నిదర్శనం అన్నారు.

# తాగునీరు రాలేదని సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం


**జయభేరి, సిద్దిపేట :**

తాగు నీరు రావడం లేదని సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను గ్రామస్థులు దహనం చేసారు. సిద్దిపేట జిల్లా ఎల్లారెడ్డి పేట గ్రామంలో తాగునీటి సరఫరా నిలచిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. తాగునీటి సమస్యను తీర్చాలని పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామ పంచాయతీ ముందు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు.

# దేవరకద్రలో గాలివాన బీభత్సం

- కారు పై పడిన ప్రహరీ గోడ
- ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం
- విరిగిపడ్డ చెట్లు, కొట్టుకుపోయిన టెంట్లు
- భయాందోళనతో పరుగులు తీసిన ప్రజలు

**జయభేరి, దేవరకద్ర :**








మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో బుధవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. దాదాపు అర గంటపాటు కురిసిన వర్షం, వీచిన గాలి కారణంగా ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కాసేపు ఏమవుతుందో అర్థం కాక ప్రజలు పరుగులు తీశారు. అనుకోకుండా ఒక్కసారిగా వాతావరణం మారిపోవడంతో భారీ వర్షంతో పాటు బలమైన ఈదురుగాలులు వీచాయి. దీంతో వారాంతపు సంతలో ఏర్పాటు చేసిన దుకాణాలు, వేసిన టెంట్లు ధ్వంసం అయ్యాయి. గప్ చుప్ బండ్లు విరిగిపోయాయి. కూరగాయలు వర్షపు నీటిలో కొట్టుకుపోయాయి. దీని కారణంగా వ్యాపారులు కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. పోచమ్మ దేవాలయం ముందు ఉన్న భారీ చెట్టు గాలివాన దాటికి విరిగి రోడ్డుపై పడింది. దీంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు అధికారులు చెట్టును తొలగించే పనులు చేపట్టారు. విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. దుకాణాలపై ఉన్న బోర్డులు ఎగిరిపోయాయి. అలాగే స్థానిక ఎస్ బి ఐ బ్యాంకు సమీపంలో గాలివానకు నిర్మాణంలో ఉన్న ఓ ప్రహరీ గోడ కూలి కారుపై పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు అతి కష్టం మీద కారులో నుండి బయటికి తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి అంబులెన్స్ లో తరలించారు. వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గాలివాన బీభత్సంతో పలుచోట్ల విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. గాలివాన దాటికి చెట్టు విరిగిపడడంతో తుంగభద్ర రైలు కాసేపు ఆగిపోయింది. దేవరకద్ర గాలివానతో అతలాకుతలమై.ఏది ఏమైనా దేవరకద్రలో గాలివాన ప్రజలను అతలాకుతలం చేసింది.



# జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం

- వైద్యులు లేకపోవడంతో కాన్పు చేసిన నర్సు.. తల్లి, బిడ్డ మృతి

**జయభేరి, భద్రాద్రి కొత్తగూడెం :**

కొత్తగూడెం జిల్లా గుండాల మండలం శంభూనిగూడెం గ్రామంలో వనజ(20) మహిళకు పురిటి నొప్పులు రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అక్కడి నర్సు సాధారణ కాన్పు చేసింది. కాన్పు తర్వాత శిశువు అపస్మారక స్థితిలోకి వెళ్లడం గమనించి ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మరణించిందని వైద్యులు తెలిపారు. తల్లికి తీవ్ర రక్తస్రావం కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం తమ కుటుంబంలో తీరని శోకాన్ని నింపిందని బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసారు.

# ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాధికారి మనోహర్
- పేదరికాన్ని రూపుమాపేది విద్య ఒక్కటే
- కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య
- "సర్పంచ్ నత్తి శివరాములు"

జయభేరి, షాద్ నగర్, జూన్ 17 :



రాసుమల్లగూడ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా అక్షరాభ్యాస కార్యక్రమం. పేదరికాన్ని తరిమికొట్టేది కేవలం విద్య ఒక్కటే. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గము ఫరూక్ నగర్ మండలం రాసుమల్ల గూడ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫరూక్ నగర్ మండల విద్యాధికారి మనోహర్ హాజరై పాఠశాల ప్రాంగణాన్ని, అన్ని తరగతికి గదులను పరిశీలించారు. అనంతరం విద్యాధికారి మనోహర్ మాట్లాడుతూ... గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాలకమండలి నాయకులతో కలిసి అక్షరాభ్యాసం చేసి పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నత్తి శివరాములు మాట్లాడుతూ... "మన ఊరు మనబడి" కార్యక్రమం పేరిట ఇదివరకే పలువురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం జరిగిందని అన్నారు. తమ గ్రామ విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించి, తల్లిదండ్రులకు భారం కాకుండా వారిని ఉన్నత స్థాయిలో చూడాలనీ పాలకమండలి నాయకుల ఆకాంక్షా అని అన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి చాలా ఆశక్తిగా ఉన్నారని, గత సంవత్సరం కంటే ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య మరింత గణనీయంగా పెరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలను ప్రతి ఒక్క విద్యార్థికి అందించడానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని, ఉన్నతమైన విద్య కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోని అందుతుందని, ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రస్తుతం దేశ విదేశాలతో పాటు, ఐఏఎస్ ఐపీఎస్, అదేవిధంగా రాజకీయ నాయకులుగా ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మనోహర్, ప్రధానోపాధ్యాయులు నర్సింలు, ఉపాధ్యాయులు కవిత, గ్రామ సర్పంచ్ నత్తి శివ రాములు ,ఉప సర్పంచ్, మెరుగు మహేందర్, వార్డు సభ్యులు శ్రీను, భారత్, గ్రామస్థులు, శ్రీనివాస్, శ్రీశైలం, రాజు, గణేష్, ప్రభాకర్, శివలీల, లావణ్య, అనసూజ, శోభన, వీరేశ్వరి, రాధిక, సుశీల, మల్లిక, రోజా, కొమురమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇల్లు పేదలకు వరం

- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం
- పబ్బతి "రత్నమ్మ కృష్ణయ్య" శివ కుమార్... నూతన ఇల్లు గృహ ప్రవేశంలో పాల్గొన్న నాగులపల్లి సర్పంచ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు



జయభేరి, షాద్ నగర్, జూన్ 17 :

ఇందిరమ్మ ఇల్లు పేదలకు ఒక వరం లాంటిది అని నాగులపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, పేదలకు వర్షాకాలం దృష్ట్యా ఇదివరకే చాలామంది ఇల్లు లేని పేదలు తమను సంప్రదించారని, ఏ ఒక్కరు ఆందోళన చెందకుండా ఉండాలని అర్హులైన ప్రతి ఒక్కరికి కచ్చితంగా ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని కాంగ్రెస్ నేతలు అన్నారు. బుధవారం నాగులపల్లి గ్రామానికి చెందిన పబ్బాతి (రత్నమ్మ కీ"శే .కృష్ణయ్య) శివకుమార్ గృహప్రవేశంలో గ్రామ సర్పంచ్ రాధిక అశోక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నందిమల రాములు గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గడిగెల పాండు గౌడ్, డాక్టర్ నాల్లపురం వెంకట్ రెడ్డి, రాసుమల్ల గూడా సర్పంచ్ నత్తి శివరాములు, ఇంటి యజమాని కుమారుడు శివ శివకుమార్, కంది ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు..

# విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



జయభేరి, పరకాల, జూన్ 17:

పరకాల పట్టణంలోని సీతారాంపురంలో శ్రీ లక్ష్మీ భూలక్ష్మీ సహిత నాగశిరల (బోడ్రాయి), పోచమ్మ, దుర్గమ్మ, మైసమ్మ, గ్రామదేవతా సహిత నాగేంద్ర, నవగ్రహ మూలతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో దేవాలయాలు, గ్రామదేవతల ఆలయాలు ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, సాంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని దేవతలను ప్రార్థించినట్లు తెలిపారు. సీతారాంపురం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ మహోత్సవం విజయవంతం కావడం ఆనందదాయకమని అన్నారు. గ్రామాభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక అభివృద్ధికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి, శాలువాతో సన్మానించారు.

# తహసిల్దార్ కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



జయభేరి, పరకాల, జూన్ 17:

పరకాల తహసిల్దార్ తోట విజయలక్ష్మి తండ్రి కీ.శే. తోట లింగం దశ దినకర్మ కార్యక్రమం ఖమ్మంలోని ఫంక్షన్ హాల్లో జరగగా ఈ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి నివాళులర్పించిన సోదా రామకృష్ణ, పరకాల కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు, కట్కూరి దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నడిగూడెం మండల అధ్యక్షులు మల్లారెడ్డి, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ దాసరి బిక్షపతి, సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ కౌన్సిలర్ పోరండ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయానిధి చెక్కును బాధితురాలకి అందజేసిన ఎంపీ సీఎం రమేష్



జయభేరి, పరవాడ:

పరవాడ గ్రామంలో నివాసం ఉంటున్న భారపు లక్ష్మి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె తన ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం చేయవలసిందిగా ముఖ్యమంత్రి కార్యాలయానికి స్థానిక బిజెపి నాయకులు కుండ్రపు సోము నాయుడు సహకారంతో అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి మంజూరైన రూ.81,572 లు చెక్కును అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ బుధవారం తన కార్యాలయంలో ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు కుండ్రపు సోము నాయుడు, ఇతర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# స్వామి ఆశీస్సులు గ్రామస్తులకు ఎల్లప్పుడూ ఉండాలి

- బండోనీగూడలో గుంటి మల్లన్న విగ్రహ ధ్వజ స్థంభ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న
- ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి



జయభేరి, షాద్ నగర్, జూన్ 17 :

భగవంతుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ ఎల్లవేళలా సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి అన్నారు.రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని బండోనీగూడ గ్రామంలో భక్తుల ఆరాధ్య దైవమైన గుంటి మల్లన్న విగ్రహా,ధ్వజ స్థంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్సి నవీన్ రెడ్డి పాల్గొన్నారు.గ్రామ అభివృద్ధి,ఆధ్యాత్మిక పరిరక్షణకు తన వంతు సహకారంగా గుంటి మల్లన్న విగ్రహం ఏర్పాటుకు రూ.3.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు.గ్రామ ప్రజల ఐక్యత,భక్తి భావానికి ఈ విగ్రహం ప్రతీకగానిలుస్తుందన్నారు.కార్యక్రమంలో పూజారులు శివానందం,కర్ణాకర్ చేగుర్ సింగిల్ విండో డైరెక్టర్ జాలగూడెం అనిత సాములయ్య,మాజీ సింగిల్ విండో డైరెక్టర్ బండ మల్లేష్, మాజీ వార్డు నెంబర్ బండ నరసింహ,నర్సప్ప గూడ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగిల్ కుమార్, బండ శ్రీశైలం,బండ అశోక్,బండ కుమార్, జెట్ట మహేందర్,చేగుర్ పబ్బే నరేందర్,జాల గూడెం శ్రీశైలం,నర్సిమ, ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు,యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థిని అజీమ్ ప్రేంజి స్కాలర్షిప్ కు ఎంపిక

జయభేరి, దేవరకొండ :

అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటి స్కాలర్షిప్కు తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల నుండి విద్యార్థిని జరుపుల దీపిక సెలెక్ట్ కావటం జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. హరిప్రియ, అధ్యాపక బృందం విద్యార్థిని నీ అభినందించారు.


# గులాబీ పార్టీ నాయకులు గెలుపు కోసం కృషి

- అంజయ్య యాదవ్ ని అసెంబ్లీ కి పంపే వరకు ప్రతి కార్యకర్తలు కష్టపడి పని చేయాలి
- కాంగ్రెస్ అబద్ధాల హామీల గురించి ప్రజల్లో అవగాహనా చేయండి
- మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- ఎస్ ఐ ఆర్ సవరణలో అప్రమత్తంగా ఉండాలి
- ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయించాలి
- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- షాద్‌నగర్ లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎస్ ఐఆర్ ఓటర్ల సవరణపై అవగాహన సదస్సు



జయభేరి, షాద్ నగర్, జూన్ 17 :

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లోని కుంట్ల రాంరెడ్డి గార్డెన్ లో బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అధ్యర్యంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లకు (బిఎల్ఎలు) అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్నికల వ్యవస్థకు వెన్నెముకలాంటివారని, ప్రజాస్వామ్య పరిరక్షణలో వారి పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాబోయే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని సూచించారు. ప్రతి బూత్‌లో పార్టీ బలాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంజయ్య యాదవ్ గారిని అసెంబ్లీ కి పంపే వరకు ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో పని చేయాలనీ అన్నారు. యువత, మహిళలు, అణగారిన వర్గాలకు చెందిన అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రతిపాదిత తొలగింపులను జాగ్రత్తగా పరిశీలించి, ఒక్క నిజమైన ఓటరు పేరు కూడా తొలగించబడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో అందజేసిన బిఎల్ఎ హ్యాండ్‌బుక్‌ను పూర్తిగా అధ్యయనం చేసి, చట్టపరమైన నిబంధనలు, ఎన్నికల కమిషన్ మార్గ దర్శకాలను అవగాహన చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అబద్ధపు 420 హామీలను ప్రజల్లో తీసుకెళ్లాలని అన్నారు. పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ అబద్దాలకు ప్యాంటూ షర్ట్ తొడిగితే అది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. లక్ష్మిదేవిపల్లి ప్రాజెక్టు ను ఆపింది కాంగ్రెస్ పార్టీ కదా అప్పుడు పరిగి ఎమ్మెల్యే రాం మోహన్ రెడ్డి ఆందోళన చేసిన విషయం నిజం కదా అసలు లక్ష్మిదేవిపల్లి ని తీసుకొచ్చిందే కెసిఆర్ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోటి మంది మహిళలను కోటిశ్వరులను చేస్తామనడం హాస్యాస్పదం అని ముందుగా వారిని లక్షధికారులను చేయాలనీ అన్నారు.ఈ అవగాహనా సదస్సు లో బిఆర్ఎస్ సర్పంచులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేకి వినతి పత్రం



జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండలంలోని తీదేడు గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు గ్రామ ప్రజల అవసరాలకు సరిపడా అందడం లేదని, గ్రామంలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా అదనంగా 20 KL సామర్థ్యం గల నూతన వాటర్ ట్యాంక్‌ను మంజూరు చేయాలని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ కి తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి మాట్లాడుతు...ప్రస్తుతం గ్రామ ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, వేసవి కాలంలో నీటి అవసరాలు మరింత పెరుగుతున్నాయని తెలిపారు.గ్రామ ప్రజలకు నిరంతరాయంగా సరిపడా తాగునీరు అందించేందుకు అదనంగా 20 KL వాటర్ ట్యాంక్ అత్యవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, మాజీ ఉప సర్పంచ్లు ఉలుపాల శేఖర్ రెడ్డి,ధరణిపతి రమణారావు,వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య,దాసరి కళమ్మ ముత్తయ్య,రెడ్డి పద్మ పరమేష్, శివర్ల పర్వతాలు యాదవ్,బిఆర్ఎస్ నాయకులు మగ్రు రామారావు, సిమర్ల శ్రీను యాదవ్,మెరిక శంకరయ్య,సందె దేవయ్య,తదితరులు పాల్గొన్నారు.

# జొన్నగిరి గ్రామంలో సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు పంపిణీ

జయభేరి, తుగ్గలి:

తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి గ్రామం నందు మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు స్థానిక టిడిపి నాయకుల ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను బుధవారం రోజున పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వేరుశనగ విత్తనాలు కావలసిన రైతులు తమ పరిధిలోని గల రైతు సేవ కేంద్రం వద్దకు పొలం పాస్ బుక్,ఆధార్ కార్డులను తీసుకుని వెళ్లి వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలియజేశారు.మండలంలో యూరియా కొరత కూడా లేదని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు సంఘాల కృష్ణ,హోటల్ మల్లి,జయరాముడు, లక్ష్మణ స్వామి,సోము ,అధికారులు,రైతులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో దొంగల హల్చల్

మండల కేంద్రమైన జిన్నారం గ్రామంలో కొలువుదిరినా కోదండ రాముల వారి దేవాలయంలో పట్టపగలే దొంగలు చోరికి పాల్పడ్డారు,,మంగళవారం మధ్యాహ్నం ఆలయంలోకి చొరపడ్డ గుర్తుతెలియని దుండగులు అయ్యప్ప పడిపూజకు సంబంధించిన సుమారు 2 లక్షల విలువ చేసే పూజా సామాగ్రిని పట్టపగలే చోరీచేశారు,,విషయం తెలుసుకున్న గ్రామస్తులు జిన్నారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు,,సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు.

# అమర్‌నాథ్ పై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

- రాష్ట్రంలో శాంతిభద్రతలపై దృష్టి పెట్టాలి
- గుడివాడపై హోంమంత్రి వ్యాఖ్యలను ఖండించిన వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి పైల, జడ్పీటీసీ పి.ఎస్ రాజు

జయభేరి, పరవాడ:



మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌పై రాష్ట్ర హోంమంత్రి అనిత చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పరవాడ మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల నియోజకవర్గ పరిశీలికులు పైల శ్రీనివాసరావు, పరవాడ జడ్పీటీసీ పైల సన్యాసిరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా పైల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌పై చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరంగా, బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు, హత్యలు, గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, శాంతిభద్రతల సమస్యలు పెరుగుతున్నాయని, వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజల భద్రతను కాపాడాల్సిన హోంమంత్రి ఆ బాధ్యతలను పక్కనపెట్టి ప్రతిపక్ష నాయకులపై విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు ఏ అంశంపై మాట్లాడినా పూర్తి అవగాహనతో, వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉండవచ్చు కానీ వ్యక్తిగత విమర్శలు చేయడం, కుటుంబాల చరిత్రను అవమానించే విధంగా మాట్లాడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విశాఖ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు కలిగిన రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి అని గుర్తు చేశారు. అలాంటి కుటుంబ నేపథ్యం కలిగిన వ్యక్తిపై వ్యాఖ్యలు చేసే ముందు కనీస అవగాహన కలిగి ఉండాల్సిన బాధ్యత హోంమంత్రిగా అనిత ఉందని అన్నారు. అనంతరం పరవాడ జడ్పీటీసీ పైల సన్యాసిరాజు మాట్లాడుతూ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌పై హోంమంత్రి అనిత చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవగాహన రాహిత్యంతో కూడుకున్నవని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని తెలుగుదేశం పార్టీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజల కోసం పని చేసిన నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం ద్వారా వాస్తవాలను దాచలేరని పేర్కొన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో వైస్సార్సీపీ సినియర్ నాయుకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, పరవాడ మండల సోషల్ మీడియా ఇంచార్జి పాశిల దివ్య, మండల ప్రధాన కార్యదర్శి బత్తి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



## పాత్రికేయ కుటుంబాలకు అండగా తెలంగాణ మీడియా అకాడమీ

- 21 మంది లబ్ధిదారులకు సంక్షేమ నిధి చెక్కుల పంపిణీ

జయభేరి, హైదరాబాద్ :

జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కె. శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో నిర్వహించిన జర్నలిస్టుల సంక్షేమ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన 21 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. జర్నలిస్టుల సంక్షేమ నిధి పథకం కింద 17 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబ సభ్యులు, నలుగురు అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.1 లక్షల ఏకమొత్తం ఆర్థిక సహాయంతో పాటు ఐదేళ్లపాటు నెలకు రూ.3,000 పెన్షన్, కుటుంబంలోని గరిష్టంగా ఇద్దరు పిల్లలకు నెలకు రూ.1,000 చొప్పున ట్యూషన్ ఫీజు అందజేస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు ఈ ప్రభుత్వం ద్వారా 159 మంది జర్నలిస్టు కుటుంబాలకు ఇలాంటి ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్నవారు తమ మధ్య ఇక లేని పాత్రికేయులను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, జర్నలిస్టులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలేటి ఐలయ్య జ్ఞాపకార్థం సీసీ కెమెరాల కోసం ఆర్థిక సహాయం అందజేత



జయభేరి, సిద్దిపేట :

ఆలేటి రమేశ్ తన తండ్రి స్వర్గీయ ఆలేటి ఐలయ్య 3వ వర్ధంతి సందర్భంగా, ఆలేటి ఐలయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) ఆలేటి రమేశ్ గ్రామాభివృద్ధికి మరో సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. తాను జన్మించిన స్వగ్రామ ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు తోడ్పాటుగా గ్రామంలో ఏర్పాటు చేయుటకు సీసీ కెమెరాల కోసం 5 వేల రూపాయల ఆర్థిక సహాయం గ్రామ పంచాయతీకి అందజేశారు. గ్రామ సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ కి అధికారికంగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలేటి రమేశ్ మాట్లాడుతూ, తన తండ్రి ఆలేటి ఐలయ్య జ్ఞాపకార్థం గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, యువత కూడా సామాజిక సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.

## ఇందిరమ్మ గృహాలతో పేదల సొంతింటి కల సాకారం

- ఇందిరమ్మ గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్
- కంసాన్ పల్లి మాల సాయిలు నూతన గృహప్రవేశానికి హాజరు

జయభేరి, షాద్ నగర్, జూన్ 17 :



రంగా రెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం కంసాన్ పల్లి గ్రామానికి చెందిన మాల సాయిలు దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఫరూక్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా రాయికల్ శ్రీనివాస్ మాట్లాడుతూ....నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేసే గొప్ప పథకం ఇందిరమ్మ గృహాలని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు గౌరవప్రదంగా జీవించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి జరుగుతోందని తెలిపారు.

గృహ యజమానీ మాట్లాడుతూ, తమకు ఇందిరమ్మ గృహం మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో తమ సొంత ఇంటి కల నెరవేరిందని, ఇందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం అందించిన సహకారంతో నేడు తమ కుటుంబం సొంత ఇంటిలో గృహప్రవేశం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నరేందర్ రెడ్డి , సీనియర్ కాంగ్రెస్ నాయకులు మున్నా , కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మల్లేష్ కురుమ, ఎడ్ల మహేందర్, తుపాకుల శేఖర్ ముదిరాజ్, నర్సింలు గౌడ్, వార్డు మెంబర్ చెన్నయ్య, చింతకింది సత్యనారాయణ, గ్రామ పెద్దలు , తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ వస్త్ర పరిశ్రమలో స్థానిక మహిళలకే తొలి ప్రాధాన్యత

- చల్లా ధర్మారెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి
- పరకాల మహిళల ఉపాధి కోసం నిరంతర కృషి

జయభేరి, పరకాల, జూన్ 17:



పరకాల పట్టణంలో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి బుధవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న మహిళలతో ముచ్చటించి, వారికి అందుతున్న శిక్షణ, సౌకర్యాలు, ఉపాధి అవకాశాలపై అడిగి తెలుసుకున్నారు. శిక్షణా కేంద్రంలో అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించిన వారు, మహిళలకు మరింత నాణ్యమైన శిక్షణ అందించే దిశగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల సాధికారతకు ఉపాధి, ఆర్థిక స్వావలంబన ఎంతో ముఖ్యమని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పోచంపల్లి ఫౌండేషన్ కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు కుటుంబానికి అండగా నిలవడంతో పాటు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలుగుతారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. ఆ పరిశ్రమలో పరకాల నియోజకవర్గ మహిళలకు తొలి ప్రాధాన్యత దక్కేలా కృషి చేస్తున్నామని, అందుకోసమే ముందస్తుగా మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతి గ్రామంలోని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగంలో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, మహిళలు, పోచంపల్లి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఎంపీలకు రూ.50 కోట్ల ఎంఎస్‌పీ.. సంజయ్ రౌత్ ఆరోపణ

జయభేరి, ముంబై:



శివసేన (యూబీటీ)లో చీలిక ఏర్పడనుందని, ఏడుగురు ఎంపీలు పార్టీ ఫిరాయించనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో ఆ పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ ఎంపీలను పార్టీ మారేందుకు ఒక్కొక్కరికి రూ.50 కోట్ల కనీస మద్దతు ధర నిర్ణయించారని, అందులో రూ.15 కోట్లు అడ్వాన్స్ ఇస్తున్నారని రౌత్ ఆరోపించారు. దీనికిముందు, పార్టీ మారేందుకు ఒక్కొక్కరికి రూ.15 కోట్లు ఆఫర్ చేస్తున్నారనటూ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా వెంటనే స్పందించారు. 'కేవలం 15 కోట్లేనా? మా ఎంపీలకు రూ.4 కోట్లు అడ్వాన్, తర్వాత 36 నెలల వరకూ నెలకూ రూ.కోటి ఆఫర్ ఇచ్చారు. హనీ ప్లస్ మనీ' అని పోస్టు చేశారు. దీనికి వెంటనే సంజయ్ రౌత్ కౌంటర్ ఇచ్చారు. 'మహువా జీ.. ఒక్కో ఎంపీకి కనీస మద్దతు ధర రూ.50 కోట్లు ఫిక్స్ చేశారు. రూ.15 కోట్లు అడ్వాన్స్ మాత్రమే. నిజానికి వీళ్లు (ఎంపీలు) రూ.50,000 కూడా విలువచేయరు. శివసేన, టీఎంసీ బ్రాండ్ లేబుల్ కారణంగానే వాళ్ల ధర పెరిగింది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వ్యంగ్యంగా పోస్ట్ పెట్టారు.




## గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసు సిబ్బందికి నగదు బహుమతి, ప్రశంసా పత్రాల ప్రదానం

జయభేరి, పరవాడ:

అనకాపల్లి జిల్లా పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుని ఐదుగురు వ్యక్తులను పట్టుకోవడంలో చూపిన అప్రమత్తత, విధి నిర్వహణలో ప్రతిభను గుర్తిస్తూ జిల్లా ఎస్పీ వారికి నగదు బహుమతి (క్యాష్ రివార్డ్)తో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదే స్ఫూర్తితో ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.

## శ్రీ సీతా రామాంజనేయ, చంద్రమౌళీశ్వర దేవాలయ 21వ వార్షికోత్సవం



జయభేరి, కొండమల్లేపల్లి :

కొండమల్లేపల్లి పట్టణంలోని చౌరస్తాలో గల ప్రముఖ దేవాలయం శ్రీ సీతారామాంజనేయ, చంద్రమౌళీశ్వర దేవాలయం 21వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అయిదున్నర గంటలకు సుప్రభాత సేవా కార్యక్రమంతో మొదలు పెట్టారు. దేవతామూర్తులకు అభిషేకం చేసి పూలమాలలతో దివ్యాంగ సుందరంగా అలంకరణ చేశారు. అనంతరం ప్రముఖ పురోహితులు పాల గణపతి శర్మ,పాల సదాశివశర్మ,ధేరం జయప్రకాష్ శర్మలు గణపతి,రుద్ర,రామతారక,నవగ్రహ, సర్వదేవత హోమాలు నిర్వహించారు. ఈ పవిత్ర హోమ కార్యక్రమంలో బొడిగ సాంబశివ గౌడ్ లలిత, బొడిగ శంకర్ గౌడ్ లక్ష్మీ శ్రీ,చెట్లపల్లి శ్రీనివాస్ ఇందిర, రావుల సత్యనారాయణ కొండలమ్మ, ఏరుకొండ రాము లలిత దంపతులు హోమం ముందు కూర్చున్నారు. హోమంలో కూర్చున్న అయిదుగురు దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పసునూరు యుగంధర్ రెడ్డి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నీల లక్ష్మయ్య,కోశాధికారి మైల బుచ్చిరెడ్డి, నాయిని రమేష్ రెడ్డి, నాయని సుభాష్ రెడ్డి, బచ్చు వెంకటేశ్వర్లు, రాచమల్ల నరసింహ, బూడిద వెంకటయ్య, నూతనగంటి ఈశ్వర్, వింజమూరు సత్యనారాయణ, కుంభం ముత్యపు రెడ్డి, నీల విజయ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండలం, తీదేడు (వెంకటంపేట) గ్రామానికి చెందిన సందే వెంకటమ్మ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించుకున్న నూతన గృహంలో నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసాన్ని అందించేందుకు కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతంగా అమలు చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. నూతన గృహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సందే వెంకటమ్మకి శుభాకాంక్షలు తెలియజేస్తూ కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, హౌసింగ్ ఏఈ చందు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శేఖర్, తీదేడు మాజీ సర్పంచ్‌లు కాయితి జితేందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, కొర్ర రాంసింగ్, పంచాయితీ కార్యదర్శి కిరణ్ కుమార్ ,సర్పంచ్ ఉలుపాల స్వప్న, ఉప సర్పంచ్ ఇడమోని వెంకటయ్య, ధరణిపతి రమణారావు, సందే లక్ష్మయ్య, శివర్ల శంకర్ యాదవ్, మురళి, సందే వెంకటయ్య, నర్సింహ,కలగొని రాజశేఖర్,సైదులు,శివ,రాజు,శ్రీను, అంజయ్య, మీనారావు, కొరివి యాదగిరి, కొండల్, ఇడమోని శంకర్ ,గంటేల నరేష్ ,కటపాక వెంకటయ్య,గునమోని శ్రీనివాస్,దాసరి మారయ్య,ఉడుత లింగయ్య, గ్రామ ప్రజలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## గాయపడ్డ వ్యక్తులు మృతి

- మృతులు ఉయ్యూరు, జార్ఖండ్ కు చెందినవారిగా గుర్తింపు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో బుధవారం రాత్రి భారీ వర్షం గాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో వర్షం వచ్చే సమయంలో కొత్తగా ఇంటి నిర్మాణం చేపడుతున్న ఇంటివద్ద కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులపై ఆ ఇంటి అయినా నూతనంగా నిర్మించే ప్రహరీ గోడ కూలింది. దీంతో అందులోని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మృతులు కృష్ణాజిల్లా ఉయ్యూరు కు చెందిన జగన్నాథరెడ్డి, ఝూర్ఖండ్ కు చెందిన సంతోష్ రావుగా గుర్తించారు. వీరు మహబూబ్ నగర్ గుడిబల్లూర్ జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం ఇక్కడికి వచ్చినట్టు తెలిసింది.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 17 :**

తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలను గ్రామ సర్పంచ్ బానోతు బులి వీరన్న అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అందుకొని చక్కటి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రేమలత, కార్యదర్శి నాగరాజు, వార్డు సభ్యులు, గ్రామస్తులు సాయి, కారోబార్ శ్రీశైలం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

**జెడ్పీహెచ్ఎస్ తుర్కపల్లిలో.....**

తుర్కపల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను సర్పంచ్ సోమల వెంకటేశం, ప్రధానోపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ది బిక్షమయ్య, పలుగుల సతీష్ కుమార్ దూదిపాల జ్యోతి ,మూసుకుల సుజాత, చింతలపూడి విశ్వేశ్వరరావు, బీరెల్లి హరిత, బండి మధుకర్ ,రాజమైన అంబాజీ, ఆదరాసు పల్లి వెంకటలక్ష్మి, భూక్య గోవిందు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్ పై శిక్షణ కార్యక్రమం



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 17 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్, ఏఈఆర్ఓ రవికుమార్ మాట్లాడుతూ ఓటరు జాబితాను ప్యూరిఫికేషన్ చేయడానికి భారతదేశ ఎన్నికల సంఘం ఇచ్చినటువంటి గైడ్లైన్స్ ప్రకారం ఓటర్ జాబితా సవరణ, డబల్ ఎంట్రీ లను, స్టిఫ్ట్, మరణించిన వారి ఓటర్లను ఒకటికి రెండు సార్లు పరిశీలన చేసి తొలగించడం జరుగుతుందని అన్నారు .అర్హులైన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పిస్తూ దొంగ ఓట్లను ఏరివేసే ప్రక్రియ కోసం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఎంటి ట్రైనర్ అశోక్ కుమార్, ఉదయ్ కుమార్, బిఎల్ఎంటి హరినాథ్ రెడ్డి, బిఎల్ఎ, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## పరవాడ నూతన సీఐ గా ఎల్. భాస్కరరావు



**జయభేరి, పరవాడ:**

పరవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఉన్న ఆర్.మల్లికార్జున రావు శ్రీకాకుళం వీఆర్కి బదిలీ అయ్యినట్టు అధికారులు నుంచి ఉత్వరలు రావడంతో అయన స్థానంలో పరవాడ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఎల్.భాస్కరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించరు. ఈయన ప్రస్తుతం శ్రీకాకుళం వీఆర్ నుంచి బదిలీపై పరవాడ పోలీస్ స్టేషన్కి వచ్చారు.

# అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లర్ ముఠా గుట్టురట్టు

- 1.06 కోట్ల విలువైన 213.360 కేజీల గంజాయి స్వాధీనం – ఐదుగురు నిందితుల అరెస్ట్
- పరవాడ పోలీస్ సిబ్బంది చాకచక్యం
- ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందజేసిన జిల్లా ఎస్పీ



**జయభేరి, పరవాడ :**

పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ బి.మోహనరావు ప్రత్యక్ష పర్యవేక్షణలో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జున రావు మరియు సిబ్బంది అంతరాష్ట్ర, అంతర్జాతీయ సంబంధాలు ఉన్న ఒక భారీ గంజాయి అక్రమ రవాణా ముఠాను రట్టు చేశారు. లంకెలపాలెం జంక్షన్ వద్ద సాహసోపేతంగా దాడి చేసి ఒక కోటి ఆరు లక్షల అరవై ఎనిమిది వేల రూపాయల విలువైన 213.360కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ తుహిన్ సిన్హా కేసు పూర్వాపరాలను వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం సుమారు 2:30 గంటల సమయంలో పరవాడ పోలీస్ స్టేషన్ మహిళా ఎస్ఐ జి.ఎస్.వి.మహాలక్ష్మి నేతృత్వంలోని ప్రత్యేక బృందం లంకెలపాలెం జంక్షన్ జాతీయ రహదారి వద్ద నిఘా పెట్టి, వాహన తనిఖీలు చేపట్టింది. నిందితులు పరస్పరం ఫోన్లలో సమాచారం ఇచ్చుకుంటూ పైలట్ బైక్‌తో వస్తుండగా, పోలీసులు అత్యంత చాకచక్యంగా కారును, బైక్‌ను చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా కారులో భారీగా తరలిస్తున్న గంజాయి పట్టుబడింది. అరెస్ట్ చేసిన ఐదుగురు నిందితులను వైద్య పరీక్షల అనంతరం అనకాపల్లి గౌరవ 11వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో రిమాండ్ నిమిత్తం హాజరుపరుస్తున్నారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితులు కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.ఈ ముఠా వెనుక ఉన్న హవాలా డబ్బు లావాదేవీలు, అంతరాష్ట్ర డ్రగ్ నెట్‌వర్క్‌పై లోతైన దర్యాప్తు సాగుతోందని అన్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అంతర్జాతీయ ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ బి.మోహనరావు, సీఐ ఆర్.మల్లికార్జున రావు, మహిళా ఎస్ఐ జి.ఎస్.వి.మహాలక్ష్మి వారి సిబ్బందికి ఈగల్ టీంకు ఎస్పీ స్వయంగా ప్రశంసా పత్రాలను,నగదు పురస్కారాలను అందజేసి సత్కరించారు.



# నూతన అడ్మిషన్ల ప్రారంభం పాఠ్యపుస్తకాల పంపిణీ

- మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి
- ప్రధానోపాధ్యాయులు పి వేణుమాధవ్ రెడ్డి

**జయభేరి, దంతాలపల్లి, జూన్17:**



పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దంతాలపల్లిలో 2026-27 విద్యా సంవత్సరానికి నూతన అడ్మిషన్ల కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు పి. వేణు మాధవ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి ఎం శ్రీదేవి, గ్రామ సర్పంచ్ పొన్నటి బాలాజీ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేరిన 8 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఆధునిక సదుపాయాలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాయని సర్పంచ్ పొన్నూటి బాలాజీ తెలియజేశారు. 2026-27 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించే విద్యార్థులకు మొదటి బహుమతిగా 25000/ రూపాయలు, రెండవ బహుమతిగా 15000/ రూపాయలు గ్రామ సర్పంచ్ శ్రీ పొన్నొటి బాలాజీ ప్రకటించారు. "ప్రభుత్వ పాఠశాలలే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు. ప్రతి విద్యార్థి విద్యను ఆయుధంగా చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి ఎం శ్రీదేవి తెలియజేశారు. అనంతరం పాఠశాలకు హాజరైన విద్యార్థులందరికీ ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ఏ లావణ్య సతీష్, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయిని ఏ .శ్రీదేవి, స్టాఫ్ సెక్రటరీ టి సురేందర్ గుప్తా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# చివరి మజిలీకి ఆధునిక అభివృద్ధి కావాలి

- కౌకూర్, యాప్రాల్ హిందూ శ్మశానవాటికల అభివృద్ధి కోసం జోనల్ కమిషనర్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి

**జయభేరి, యాప్రాల్ :**



మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెల్ల మల్లికార్జున్, యాప్రాల్ డివిజన్ కాంగ్రెస్ నాయకులతో కలిసి మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ను కలిసి కౌకూర్ ప్రాంత అభివృద్ధి, శ్మశానవాటికల ఆధునీకరణ మరియు పలు ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన వినతి పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా తుడిమెల్ల మల్లికార్జున్ మాట్లాడుతూ, కౌకూర్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కౌకూర్ హిందూ శ్మశానవాటికలో ఆధునిక సౌకర్యాల కొరత కారణంగా స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అందువల్ల శ్మశానవాటికను మోడల్ గ్రేవ్‌యార్డ్‌గా, ఆధునిక దహనవాటికగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. వినతిపత్రంలో భాగంగా కౌకూర్ హిందూ శ్మశానవాటికలో కాంపౌండ్ వాల్, గ్రాండ్ ఎంట్రన్స్ గేట్, సీసీ రోడ్లు, హైమాస్ట్ లైటింగ్, తాగునీటి సదుపాయం, బోర్‌వెల్, వెయిటింగ్ హాల్, పార్కింగ్ స్థలం, భద్రతా ఏర్పాట్లు, ఆధునిక ఎలక్ట్రిక్ క్రిమేటోరియం, దహన వేదికలు, అస్తికలశ భద్రపరిచే గది వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా యాప్రాల్ హిందూ శ్మశానవాటికను కూడా సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ సూచించారు. యాప్రాల్ శ్మశానవాటిక అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. అలాగే కౌకూర్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కింది బస్తీలో హనుమాన్ ఆలయం నుండి ప్రియదర్శిని ఎన్‌క్లేవ్ వరకు రైన్ స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పైప్‌లైన్ నిర్మాణం, మల్లికార్జున నగర్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం, భరత్ నగర్‌లో మూడు లైన్లలో స్టెప్స్ మరియు రిటైనింగ్ వాల్ నిర్మాణం, మల్లారెడ్డి కాలనీ ఫేజ్ 2లో సీసీ రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. ఈ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి త్వరితగతిన ఆమోదాలు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. కౌకూర్ ప్రాంత అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, జిల్లా నాయకులు బొడ్డు శ్రీనివాస్ యాదవ్, నాయకులు శ్రవణ్, అల్లి మల్లేష్, అల్లి పాండు, ప్రవీణ్ రెడ్డి, గోమారం అంజి రెడ్డి, సయ్యద్ అయ్యుబ్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.





## ప్రస్తుతం నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ

**జయభేరి, మేడిపల్లి :**

ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం మేడిపల్లిలోని తులిప్స్ గ్రాండ్ హోటల్‌లో ఘనంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సి. ప్రభాకర్ రావు, ముఖ్య సలహాదారు, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడు జేపీ విద్యాసాగర్ ముఖ్య అతిథులుగా హాజరై నిర్మాణ రంగానికి సంబంధించిన పలు అంశాలపై విలువైన సూచనలు చేశారు. ప్రస్తుతం నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా సెంట్రింగ్, మేస్త్రి కార్మికుల సమ్మె ప్రభావం, TGSPDCL శాఖ నుంచి బిల్డర్లకు ఎదురవుతున్న వివిధ ఇబ్బందులు, అలాగే ఇటీవల ప్రభుత్వం పట్టా భూములు, రిజిస్టర్డ్ ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చిన అంశాలపై సభ్యులు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. ఈ సందర్భంగా బిల్డర్స్ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి స్పాన్సర్ గా వ్యవహరించిన Shree TMT ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఎస్ కరుణాకర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ సామ సతీష్ రెడ్డి,అడ్వైజర్ రమేష్, కోశాధికారి మురళి, ఉపాధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,రాజేష్ రెడ్డి, రమేష్ బాబు,మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, బిల్డర్స్ తదితరులు పాల్గొన్నారు.

## శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యం

- రవీందర్ రెడ్డి నగర్, కేసిఆర్ నగర్, శ్రీరామ కాలనీల్లో మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**జయభేరి, ఉప్పల్ :**

రవీందర్ రెడ్డి నగర్, కేసిఆర్ నగర్, శ్రీరామ కాలనీలలో మురుగు కాలువ (సీవర్ లైన్) నిర్మాణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడంతో పాటు మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ఈ పనులను చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సీవర్ లైన్ నిర్మాణం పూర్తయిన అనంతరం కాలనీ వాసులు ఎదుర్కొంటున్న మురుగునీటి నిల్వ, దుర్వాసన, పారిశుద్ధ్య సమస్యలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు ,HMWS మేనేజర్ రవీందర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# నెల రోజుల పాటు.. చక్కెర తినడం మానేసి చూడు

**మనం తీసుకునే ఆహారంలో చక్కెర ఒక భాగమైనదని చెప్పవచ్చు. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రం నిద్రించే వరకు ఏదో ఒక రూపంలో చక్కెరను తీసుకుంటూనే ఉంటాం. టీ, కాఫీ, జ్యూస్, స్వీట్స్, కుక్కీస్ ఇలా ఏదో ఒక రూపంలో చక్కెర మన శరీరంలోకి వెళ్తూనే ఉంటుంది. అయితే చక్కెరను తీసుకోవడం 30 రోజుల పాటు మానేయడం వల్ల మనం అనేక శారీరక, మానసిక మార్పులను గమనించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే చక్కెరను మానేసిన తరువాత మొదట్లో మనం కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెరను తీసుకోవడం మానేసిన తరువాత చిరాకు, అలసట, ఆందోళన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. మెదడు చక్కెర అందించే డోపమైన్ హిట్ ను కోల్పోవడం వల్ల ఇలా జరుగుతుంది. చక్కెర తీసుకోవాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. శరీరం నెమ్మదిగా చక్కెరకు దూరం అయ్యే కొద్దీ ఈ కోరికలు తగ్గుతూ వస్తాయి.**

### కొవ్వు కరుగుతుంది..

డిటాక్స్ ట్రెండ్ కంటే ఎక్కువగా చక్కెరను తీసుకోకపోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలే ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలా చక్కెరను తీసుకోవడం తగ్గించడం వల్ల క్రమంగా రెండవ వారం నాటికి రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. రక్తంలో గ్లూకోజ్ మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది. ఇన్సులిన్ స్థాయిలు తగ్గడంతో శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగించడం ప్రారంభిస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఇక మూడవ వారం కూడా చక్కెరను తీసుకోవడం మానేయడం వల్ల మనం దీర్ఘకాలిక ప్రయోజనాలనుగమనించవచ్చు. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దద్దుర్లు, మంట, మొటిమలు, పగుళ్లు వంటివి తగ్గుతాయి. అకాల వృద్ధాప్యం రాకుండా ఉంటుంది. రక్తంలో చక్కెర క్రాష్ లు తగ్గడం వల్ల మనం మరింత స్థిరంగా దృష్టి కేంద్రీకరించవచ్చు.

### కొలెస్ట్రాల్ అదుపులో..

క్యాలరీలు తీసుకోవడం తగ్గడం వల్ల శరీర బరువు తగ్గడాన్ని మనం ఎక్కువగా గమనించవచ్చు. అంతేకాకుండా అధిక కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ వంటి కాలేయ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక చక్కెర ఉండే స్వీట్లు, పానీయాలు, బేక్ చేసిన వస్తువులు తీసుకోవడం తగ్గించడం వల్ల ప్రజలు పండ్లు, గింజలు వంటి వాటిని తీసుకోవడానికి మొగ్గు చూపుతారు. దీంతో శరీరానికి కావల్సిన పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. చక్కెర కలిగిన ఆహార పదార్థాలకు బదులుగా నానబెట్టిన ఖర్జూరాలు, పెరుగు వంటి వాటిని తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. పేగు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

### ఉత్సాహంగా మారుతారు..

అంతేకాకుండా చక్కెరలో వచ్చే హెచ్చుతగ్గులు బద్ధకం, చిరాకుకు కారణమవుతాయి. కనుక చక్కెరను మానేయడం వల్ల మనం ఉత్సాహంగా ఉండడంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉండవచ్చు. ఇలా నెలరోజుల పాటు చక్కెర తీసుకోవడం మానేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. చక్కెర మానేయడం తాత్కాలికంగానే కాకుండా స్థిరమైన జీవనశైలి ఎంపికగాఉండాలని వారు సూచిస్తున్నారు. చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరం వంటి వాటిని మితంగా తీసుకోవాలి. అలాగే తీపి వంటకాల తయారీలో చక్కెరకు బదులుగా యాలకులు, దాల్చిన చెక్క వంటి వాటిని వాడడం వల్ల తీపి తింటున్నామన్న అనుభూతి పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.



# జంక్ ఫుడ్ మానేస్తే.. మీ ముఖంలో కనిపించే మార్పులు

**జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని అందరికీ తెలుసు. అయినా సరే చాలామంది ఆ ఫుడ్ నే ఇష్టంగా తింటుంటారు. కానీ జంక్ ఫుడ్ ని ఒక 30 రోజులు మానేస్తే మీ శరీరంలో ఎన్ని మార్పులు జరుగుతాయో తెలుసా? ముఖ్యంగా ఫేస్ లో కనిపించే ఈ మార్పులు చూస్తే షాక్ అవుతారు.**

### 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే..

మనలో చాలామంది ఫాస్ట్ ఫుడ్, ప్యాకేజ్డ్ స్నాక్స్, కేక్‌లు, చిప్స్ వంటి పదార్థాలను ఇష్టంగా తింటుంటారు. కానీ అవి మన శరీరం, ముఖ్యంగా చర్మంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో తెలుసా? ఆరోగ్య నిపుణులు, స్కిన్ కేర్ ఎక్స్‌పర్ట్‌ల ప్రకారం కేవలం 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా ముఖంలో కలిగే మార్పులేంటో ఇక్కడ తెలుసుకుందాం.

### మృదువుగా మారుతుంది

జంక్ ఫుడ్ ఎక్కువగా సాచ్యూరేటెడ్ ఫ్యాట్స్, షుగర్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది చర్మంలో ఇన్ఫ్లమేషన్ ను పెంచుతుంది. ముడతలు, ఎరుపు, పొడిబారడం వంటి సమస్యలకు కారణమవుతుంది. జంక్ ఫుడ్ మానేసిన వెంటనే, శరీరంలోని ఇన్ఫ్లమేటరీ రియాక్షన్స్ తగ్గుతాయి. 30 రోజుల్లో చర్మం సహజంగా హైడ్రేటెడ్ గా, మృదువుగా మారుతుంది. ముఖ్యంగా కేకులు, కోల్డ్ డ్రింక్స్, చిప్స్ మానడం వల్ల చర్మం.. లోపలి తేమను నిలుపుకోవడానికి అవకాశం ఉంటుంది.

### కొల్లాజెన్ ఉత్పత్తిపై ప్రభావం

షుగర్ అధికంగా తీసుకోవడం వల్ల చర్మంలోని కొల్లాజెన్ దెబ్బతింటుంది. కొల్లాజెన్ శక్తిని కోల్పోవడం వల్ల చర్మంపై ముడతలు మొదలవుతాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా, కొల్లాజెన్ ఉత్పత్తి సక్రమంగా ఉంటుంది. దానివల్ల చర్మం స్థిరంగా ఉంటుంది, ముడతలు తగ్గుతాయి. కాంతివంతంగా మారుతుంది.

### ముఖం స్లిమ్ గా కనిపించడం

జంక్ ఫుడ్ ఎక్కువగా సోడియం, ఫ్యాట్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో వాటర్ రిటెన్షన్, మలినాలు, ఫేస్ బ్లోటింగ్ కు కారణమవుతుంది. ఆరోగ్య నిపుణుల ప్రకారం, 30 రోజులు జంక్ ఫుడ్ మానేసి.. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఫేస్ బ్లోటింగ్ తగ్గి ముఖం స్లిమ్ గా కనిపిస్తుంది. అలాగే, యాంటీ ఆక్సిడెంట్‌లు ఎక్కువగా ఉండే ఫుడ్స్ తీసుకోవడం వల్ల చర్మం లోపలి నుంచి మెరుగుపడుతుంది.

### ముఖం ఫ్రెష్ గా..

జంక్ ఫుడ్ లోని ఫ్యాటీ, ప్రాసెస్డ్ పదార్థాలు శరీరంలోని యాంటీఆక్సిడెంట్ స్థాయిలను తగ్గిస్తాయి. చర్మం యూవీ కిరణాల ప్రభావానికి లోనవుతుంది. జంక్ ఫుడ్ మానేసి.. ఇతర ఫ్రూట్స్, వెజిటబుల్స్ తీసుకుంటే వాటిలోని యాంటీ ఆక్సిడెంట్‌లు చర్మ రికవరీని వేగవంతం చేస్తాయి. సన్ డ్యామేజ్ తగ్గి, చర్మం తాజాగా మారుతుంది.

### ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

చర్మంలో కనిపించే ఈ మార్పులు మానసికంగా పెద్ద మార్పులకు దారితీస్తాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే.. ముఖం స్పష్టంగా మెరుస్తుంది, చర్మం ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. జంక్ ఫుడ్ మానేయడం ఒక్క చర్మ ఆరోగ్యానికే కాదు.. మొత్తం శరీర ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



# జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి?

**జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరగడానికి మనం తలకు నూనె రాస్తుంటాం. తలపై నూనెతో స్మూత్ గా మసాజ్ చేస్తే ప్రశాంతంగా అనిపిస్తుంది. జుట్టు కుదుళ్లు కూడా బలపడతాయి. జుట్టు చక్కగా పెరగాలంటే ఎన్ని రోజులకు ఒకసారి నూనె రాయాలి? నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసా?**

మనం జుట్టుకు రెగ్యులర్ గా నూనె రాస్తుంటాం. దానివల్ల జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. కానీ జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి? రోజూ రాయడం మంచిదా? లేక వారంలో ఒకటిరెండు సార్లు రాస్తే సరిపోతుందా? నిపుణులు ఏం చెబుతున్నారో ఇక్కడ వివరంగా తెలుసుకుందాం.

### వారానికి 1-2 సార్లు

ఆరోగ్య నిపుణుల ప్రకారం జుట్టుకు వారానికి 1-2 సార్లు ఆయిల్ రాయడం మంచిది. సాధారణ లేదా డ్రై హెయిర్ ఉన్నవారు వారానికి రెండు సార్లు రాసుకోవచ్చు. ఆయిలీ స్కాల్ప్ ఉన్నవారు వారానికి ఒకసారి జుట్టుకు నూనె రాస్తే సరిపోతుంది. దానివల్ల స్కాల్ప్ ఉత్పత్తి చేసే సహజ నూనెలపై చెడు ప్రభావం పడదు.

### రోజూ రాస్తే ఏమవుతుంది?

సాధారణంగా చాలామంది రోజూ నూనె రాసుకుంటే జుట్టు బాగా పెరుగుతుందని అనుకుంటారు. కానీ దానివల్ల హెయిర్ ఫోలికల్స్ బలహీనపడే అవకాశం ఉంది. అంతేకాదు దుమ్ము, ధూళి వంటివి తలపై చేరి చర్మరంధ్రాలు మూసుకుపోతాయి. ఫలితంగా చుండ్రు, ఇరిటేషన్, హెయిర్ ఫాల్ వంటి సమస్యలు ఎదురవుతాయి.

### నూనె వేడి చేసి రాస్తే..

ఆయిల్ వాడటం వల్ల జుట్టుకు హైడ్రేషన్ లభిస్తుంది. తలపై స్మూత్ గా మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. అయితే చాలామంది నూనెను కొద్దిగా వేడి చేసి జుట్టుకు అప్లై చేస్తుంటారు. గోరువెచ్చని నూనెతో తలపై మసాజ్ చేస్తే.. జుట్టులోకి సులభంగా ఇమిడిపోతుంది. అలాగే రక్తప్రసరణ మెరగవుతుంది. కానీ నూనెను ఎక్కువ వేడి చేయడం మంచిది కాదు. అదే విధంగా జుట్టుపై బలంగా రుద్దడం కూడా ప్రమాదకరం అని నిపుణులు సూచిస్తున్నారు.

### ఎక్కువసేపు ఉంచితే?

జుట్టుకు నూనె రాసిన తర్వాత మరీ ఎక్కువసేపు ఉంచకూడదు. 45 నిమిషాల నుంచి 2 గంటల వరకు ఉంచితే సరిపోతుంది. దానికంటే ఎక్కువసేపు ఉంచితే.. ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. ఫంగల్ ఇన్ఫెక్షన్లు, చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలు ఎదురవుతాయని సూచిస్తున్నారు.

### ఏ నూనె వాడొచ్చు?

నిపుణుల ప్రకారం జుట్టు రకాన్ని బట్టి నూనెను ఎంచుకోవాలి. పొడి జుట్టుకు కొబ్బరి నూనె వాడొచ్చు. కొబ్బరినూనె జుట్టు లోపలి వరకు చొచ్చుకుపోయే గుణాలను కలిగి ఉంటుంది. అలాగే మందపాటి జుట్టుకు బాదం నూనె, జుట్టు పెరుగుదలకు ఆముదం నూనె వంటివి వాడొచ్చు.



